# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి వేముల



పాలెంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, అక్టోబర్1: మండలంలోని గాండ్లపేట్, పాలెం, తిమ్మాపూర్,మోర్తాడ్, సుంకెట్ గ్రామాల్లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గాండ్లపేట్‌లో నూతన జీపీ భవన నిర్మాణానికి, పాలెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, పాలెం-తిమ్మాపూర్ రోడ్డుపై స్లాబ్, కల్వర్టు నిర్మాణానికి, పాలెం-ధర్మోరా బీటీరోడ్డు నిర్మాణానికి, బ్రిడ్జి నిర్మాణానికి, తిమ్మాపూర్‌లో తిమ్మాపూర్-కమ్మర్‌పల్లి రోడ్డు స్పెషల్ రిపేర్స్ కోసం, తిమ్మాపూర్-ఉప్లూర్ బీటీరోడ్డు రెన్యువల్, మోర్తాడ్‌లో స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి, మోర్తాడ్ హైవేపై పాలెం ఎక్స్‌రోడ్డు నుంచి పెట్రోల్ బంకు వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్‌లైటింగ్‌కు, మోర్తాడ్-భీమ్‌గల్ రోడ్డుపై స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి, పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.50లక్షలతో నిర్మించిన ప్రజా కళ్యాణమండపాన్ని ప్రారంభించారు. సుంకెట్‌లో సుంకెట్-వెంకటాపూర్ మధ్యలో పెద్దవాగుపై నిర్మించే రోడ్డు, డ్యామ్ నిర్మాణ పనులకు, సుంకెట్-మోర్తాడ్ రోడ్డుపై కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు కోటపాటి నర్సింహనాయుడు, రాష్ట్ర విత్తన కమిటీ సభ్యుడు సంజీవ్‌రెడ్డి, ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, సొసైటీ చైర్మన్ అశోక్, రైతుబంధు మండల కన్వీనర్ పర్స దేవన్న, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచులు బోగ ధరణి, మామిడి సౌజన్య, సంతోష్, గడ్డం చిన్నారెడ్డి, శ్రీనివాస్, ఎంపీటీసీలు అస్మాఅజారుద్దీన్, రాజ్‌పాల్, అశోక్, సత్యనారాయణ, బోగ ఆనంద్, గంగారెడ్డి, ఇంతియాజ్, జేసీ గంగారెడ్డి, చిన్నారెడ్డి, దడివెనవీన్, రోహిత్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో మంత్రి వేముల పర్యటన

వేల్పూర్, అక్టోబర్1: రాష్ట్ర రోడ్లు-భవనాలు, హౌసింగ్, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు రూ.8కోట్ల15లక్షల వ్యయంతో ఏర్గట్ల మండలం తొర్తి గ్రామంలో పాలెం నుంచి ఏర్గట్ల వయా తొర్తి బీటీ రోడ్డుకు పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10 గంటలకు బట్టాపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, రూ.10లక్షలతో పైప్ కల్వర్టు నిర్మాణ పనులు, ఉదయం 10.45 గంటలకు ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్ నుంచి తాళ్లరాంపూర్ రూ.కోటి 80లక్షలతో బీటీ రోడ్డు పనులు, గుమ్మిర్యాల్ నుంచి కొండాపూర్ రోడ్డుపై స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులు రూ.50లక్షలు, ఉదయం 11.30గంటలకు దోంచంద నుంచి తాళ్లరాంపూర్ వరకు రూ.కోటి 30లక్షలతో బీటీ రోడ్డు రెన్యువల్ పనులు, మధ్యాహ్నం 12 గంటలకు కమ్మర్‌పల్లి, తడ్ పాకల్ రోడ్డుపై తాళ్లరాంపూర్ వద్ద రూ.కోటి 60లక్షలతో మైనర్ బ్రిడ్జి, రూ.4కోట్ల45లక్షలతో తాళ్లరాంపూర్-వర్షకొండ వరకు రోడ్డు రెన్యువల్ పనులు, రూ.కోటి 30లక్షలతో తాళ్ల రాంపూర్ నుంచి దోంచంద వరకు రోడ్డు రెన్యువల్ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఎర్గట్ల మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. రూ.కోటి 62లక్షలతో ఎన్ఏబీఏఆర్డీ గోడౌన్, సీసీ ప్లాట్ ఫామ్, సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణ పనలకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. రూ.కోటి 20లక్షలో బట్టాపూర్ గూడూర్ రోడ్డు రెన్యువల్ పనులకు, మధ్యాహ్నం 1గంటకు కమ్మర్‌పల్లి, తడ్‌పాకల్ రోడ్డుపై ఉప్లూర్, ఆర్ఆర్ నగర్ వద్ద న్యారో బ్రిడ్జి విస్తరణ పనులకు రూ.కోటి 12లక్షలతో శంకుస్థాపన, మధ్యాహ్నం 3 గంటలకు ముప్కాల్ మండలం వెంపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. రూ.2కోట్ల50లక్షలతో కిసాన్ నగర్ నుంచి రెంజర్ల రోడ్డు వయా వేంపల్లి వరకు, రూ.20లక్షలతో కిసాన్ నగర్‌లో హెల్త్ సబ్ సెంటర్, రూ.5లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనం పనులకు, సాయంత్రం 4.30గంటలకు ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. రూ.4కోట్ల 40లక్షలతో బుస్సాపూర్ నుంచి పెద్దవాగు వరకు రోడ్డు రెన్యువల్ పనులు, రూ.2కోట్ల33లక్షలతో నాగంపేట్ నుంచి వెల్కటూర్ తండా వరకు రోడ్డు నిర్మాణ పనులు, సాయంత్రం 5.30 గంటలకు ముప్కాల్ మండలం రేంజర్ల గ్రామంలో రూ.50లక్షలతో స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన, రూ.2కోట్ల50లక్షలతో కిసాన్ నగర్- రెంజర్ల బీటీ రోడ్డు వయా వేంపల్లి పనులకు, రూ.4కోట్ల40లక్షలతో బుస్సాపూర్ నుంచి పెద్దవాగు వరకు రోడ్డు రెన్యువల్ పనులకు , సాయంత్రం 6.30గంటలకు వెంచిర్యాల్ గ్రామంలో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు.

## ఆలయ కమిటీ కార్యవర్గం ఎన్నిక



ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

బోధన్ రూరల్, అక్టోబర్1: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో గ్రామంలో జగదంబమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయ కార్యవర్గ నిర్వహణ కమిటీని మండలంలోని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మచ్యా నామ్‌దేవ్, క్యాషియర్‌గా రమావత్ రవిదాస్ నాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా నూనావత్ విశ్వనాథ్, మోహన్, గోప్యానాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజ్యానాయక్, ఉప సర్పంచ్ విఠల్‌నాయక్ పాల్గొన్నారు.

## సభకు తరలిన ముస్లింలు

మెండోరా, అక్టోబర్ 1: వేల్పూర్ మండలం లక్కోరా ఏఎంజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సభకు మండలంలోని మైనార్టీలు తరలివెళ్లారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, హోంమంత్రి మహమూద్ అలీ ఆధ్వర్యంలో ముస్లింలకు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తుండడంతో మండల కేంద్రంతోపాటు పోచంపాడ్, దూద్‌గాం గ్రామాల నుంచి బస్సులు, కార్లలో, ద్విచక్ర వాహనాలపై ముస్లింలు తరలివెళ్లారు.

## జర్నలిస్టు కాలనీలో శ్రమదానం

ఆర్మూర్, అక్టోబరు1: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీలో భాగంగా నిర్వహిస్తున్న 18వ వారం కాలనీవాసుల శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణగౌడ్, కార్యదర్శి కొంతం రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యాదవులంతా ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న రాజారాం యాదవ్

మాక్లూర్, అక్టోబర్ 1: యాదవులంతా కలిసికట్టుగా ఐక్యంగా ఉండాలని అఖిల భారత యాదవ నాయకుడు రాజారాం యాదవ్ అన్నారు.

మండల కేంద్రంలో మండల అఖిల భారత యాదవ ఆత్మీయ సమ్మేళన మహసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అఖిల భారత యాదవ కన్వీనర్ బాబూరావు యాదవ్, మండల అధ్యక్షుడు మెడిద గంగాధర్ యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజన్న యాదవ్, జిల్లా అధ్యక్షులు మహిపాల్ యాదవ్, కృష్ణ యాదవ్, గుడల లింగం యాదవ్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ఏపీపీ సమ్మయ్యను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

బోధన్, అక్టోబర్ 1: బాలికలు, మహిళల పరిరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు న్యాయవాదులు సూచించారు. ఆదివారం పట్టణంలోని రూనక్ ఫంక్షన్‌హాల్‌లో జమాతే ఉల్మా ఏ హింద్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీపీ ఆబేద్ అహ్మద్ సోఫీ, ఏపీపీ డాక్టర్ పల్నాటి సమ్మయ్య, హైకోర్టు న్యాయవాది సయ్యద్ ఎతెమాదుద్దీన్ జుబేర్‌తో పాటు పలువురు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలికలు, మహిళల పరిరక్షణ చట్టాలతోపాటు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సదస్సును జమాతే ఉల్మా ఏ హింద్ బోధన్ పట్టణ అధ్యక్షుడు ముఫ్తీ జాబీర్ ఇషాతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయవాదులను ఆ సంఘం ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది వాజీద్ హుస్సేన్, నిర్వాహకులు మహ్మద్ వసీం ఖాన్, ఎస్‌కే అబ్రార్, ఎస్‌కే అన్వర్, ఎస్‌కే తమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలు అవసరం

### హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ మధుశేఖర్



మాట్లాడుతున్న డాక్టర్ మధుశేఖర్

ఆర్మూర్, అక్టోబర్1: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో 42వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక శారీరక అభివృద్ధి, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి తొమ్మిది బాలుర జట్లు, ఎనిమిది బాలికల జట్లు హాజరై మొదటి రోజు తలపడ్డాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెరువులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న సర్పంచ్ రవి, మత్స్యకారులు

నందిపేట్, అక్టోబర్ 1: డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలోని రెండు చెరువుల్లో 80 వేల చేప పిల్లలను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, మత్స్యసంఘం అధ్యక్షుడు భోజన్న, మధు, రామకృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

మెండోరా, అక్టోబర్ 1: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గిందని ఏఈఈ సారిక ఆదివారం తెలిపారు. ప్రాజెక్టులోకి 16, 318 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందన్నారు. కాకతీయ కాలువకు 2,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల నుంచి గోదావరిలోకి 5,500, సరస్వతి కాలువకు 300, లక్ష్మి కాలువకు 200, వరదకాలువకు 7 వేలు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామన్నారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి రిజర్వాయర్‌లోకి 187 టీఎంసీల వరదనీరు వచ్చిందని ఏఈఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉందన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడి మృతి

ఎడపల్లి, అక్టోబర్ 1: మండలంలోని ఏఆర్‌పీ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఉజ్వల భర్త వాజ్రేద్ మధుకర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పార్టీలో ఎన్నో సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. ఆయన మృతిపై ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందిపేట్, అక్టోబర్ 1: మండల కేంద్రానికి చెందిన గంట కృష్ణారెడ్డి (20) ఐదు నెలల క్రితం నిజామాబాద్ నుంచి నందిపేట్ వైపు తన బైక్‌పై వస్తుండగా రాత్రి 10 గంటలకు విజయనగరం వద్ద రోడ్డుపై ఉన్న వడ్ల కుప్పకు ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు జిల్లా దవాఖానకు తరలించారు. దవాఖానలో రెండు నెలలు చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కాంటినెంట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని వైద్యులు వెల్లడించారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.